## నేటి నుంచి ఆలిండియా ఇంటర్ ఇనిస్టిట్యూట్ క్యారమ్స్ టోర్నమెంట్


మాట్లాడుతున్న క్యారమ్ ఫెడరేషన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ్‌కుమార్

కంఠేశ్వర్, మే 22 : ఆలిండియా ఇంటర్ ఇనిస్టిట్యూట్ క్యారమ్స్ టోర్నమెంట్ నేటి (గురువారం) నుంచి ప్రారంభమవుతుందని ఆలిండియా క్యారమ్ ఫెడరేషన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఓ పాఠశాలలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 26వ తేదీ వరకు క్యారమ్ స్త్రీ, పురుషుల పోటీలు జరుగుతాయని తెలిపారు. క్యారమ్ అసోసియేషన్ స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణకు చెందిన క్యారమ్ అసోసియేషన్ నేతృత్వంలో, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో నిజామాబాద్‌లోని నవ్యభారతి గ్లోబల్ పాఠశాలలో టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు చెప్పారు. తెలంగాణలో మొదటిసారిగా 350 నుంచి 400 మంది బృందాలు పోటీల్లో పాల్గొంటాయని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులు సైతం టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో క్యాట్ అధ్యక్షుడు సంతోష్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శోభన్‌రాజ్, జీఎస్ క్యాట్ ఏఐసీఎఫ్ టోర్నమెంట్ వైస్‌చైర్మన్ మదన్‌రాజ్, జనరల్ సెక్రటరీ భారతి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కార్ఖానా మునీంపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

డిచ్‌పల్లి, మే 24 : ఇందల్వాయిలోని చార్‌భాయ్ బీడీ కార్ఖానా టేకేదార్ (మునీం) వైకుంఠంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీడీ కార్మికులు డిచ్‌పల్లిలోని ఆ కంపెనీ యాజమాన్యానికి బుధవారం ఫిర్యాదు చేశారు. తమకు నాసిరకం ఆకు, తంబాకు సరఫరా చేయడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. బీడీ కార్మికులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నాడని, టేకేదార్‌గా తొలగించి తమకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని బీడీ యాజమాన్యం హామీ ఇచ్చినట్లు బీడీ కార్మికులు తెలిపారు.

## మొక్కలు సిద్ధం చేయాలి


దేగాం గ్రామంలో నర్సరీని పరిశీలిస్తున్న డీపీవో తరుణ్ కుమార్

ఆర్మూర్‌టౌన్, మే22: ఆలూర్ మండలం దేగాం గ్రామంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం, నర్సరీ, కంపోస్ట్ షెడ్డు, వైకుంఠ ధామాలను జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ కుమార్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ వర్షాలు కురిసిన తర్వాత రోడ్లకు ఇరువైపులా నాటేందుకు మొక్కలు సిద్ధం చేయాలని అధికారులను సూచించారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా మురికి కాలువలను శుభ్రం చేయించాలని కార్యదర్శులను ఆదేశించారు. ఆయనవెంట డీఎల్‌పీవో శివకృష్ణ, ఎంపీవో శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# దొడ్డు రకం వడ్లకూ బోనస్ ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నల్ల సారిక

**మండల సర్వసభ్య సమావేశంలో తీర్మానం**

ధర్పల్లి (సిరికొండ), మే 22 : రైతులు పండించే దొడ్డు రకం వడ్లకూ ప్రభుత్వం బోనస్ ఇవ్వాలని మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ నల్ల సారికా హన్మంత్‌రెడ్డి అధ్వర్యంలో తీర్మానం చేశారు. ధర్పల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే ఈ సమావేశం మొక్కుబడిగా సాగింది. సమావేశంలో వివిధ శాఖల అధికారులు.. ప్రజాప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ, ప్రగతి నివేదిక చదివి వినిపించారు. అంతకుముందు ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన మండల వ్యవసాయాధికారి ప్రవీణ్ చిత్రపటానికి నివాళులర్పించి, రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. సమావేశంలో ఎంపీడీవో బాలకృష్ణ, తహసీల్దార్ మాలతి, వైస్ ఎంపీపీ కల్లెడ నవీన్, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

## మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాలలో చేరాలని ప్రచారం

కోటగిరి, మే 22 : మండలకేంద్రంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలుర జూనియర్ కళాశాలలో చేరాలని సూచిస్తూ అధ్యాపకులు బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కళాశాలలో విద్యాబోధన, కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలపై ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ ముబీన్ అవగాహన కల్పించారు. పోతంగల్ మండలంలోని హంగర్గాఫారం, పోతంగల్, జల్లాపల్లిఫారంలో ఇంటింటికీ వెళ్లి పదోతరగతిలో ఉత్తీర్ణత సాధించిన పలువురు బాలుర నుంచి అడ్మిషన్లు తీసుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎజాజ్‌ఖాన్, పంచాయతీ కార్యదర్శి నిర్మల, వలీయొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అడ్మిషన్ పత్రాలను అందజేస్తున్న అధ్యాపకులు


సర్టిఫికెట్లను అందజేస్తున్న నిర్వాహకులు

## ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

సుభాష్‌నగర్, మే 22 : జిల్లాకేంద్రంలోని శివాజీనగర్‌లో శ్రీరామకృష్ణ విద్యాలయంలో చేపట్టిన వేసవి శిక్షణ శిబిరం బుధవారంతో ముగిసింది. పరివర్తన్ – 2024 పేరుతో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ధ్యానం, శ్లోకాలు, యోగా, డ్రాయింగ్, వేమన పద్యాలు, ఇంగ్లిష్ గ్రామర్ తదితర అంశాలపై 25 రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు నిర్వాహకులు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎన్ చారి, బుచ్చన్న, ఓంప్రకాశ్, మధుసూదనాచారి, శశిరేఖ, మాధురి, చంద్రశేఖర్, ఈశ్వర్, శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.


ఎల్లారెడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఇందల్వాయి, మే 22 : మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామ జడ్పీహెచ్ఎస్‌లో చదివిన ఎస్సెస్సీ 2005–06 బ్యాచ్ విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని పాఠశాలలో బుధవారం నిర్వహించారు. విద్యార్థులందరూ ఒకే వేదికపై చేరి, విద్యార్థి దశ జ్ఞాపకాలను గుర్తుచేసుకొని రోజంతా సందడిగా గడిపారు. వారికి చదువు చెప్పిన ఉపాధ్యాయులు రాజేశ్వర్‌రెడ్డి, ప్రణేశ్వర్, గోవింద్, ఉష, గోదావరిని ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నూతన మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఏర్పాటు చేయాలి

ఖలీల్‌వాడి, మే 22 : తెలంగాణ ముదిరాజ్ మహాసభ – నిజామాబాద్ జిల్లా ఆధ్వర్యంలో కోటగిరి మండలం రాంపూర్ గ్రామంలో నూతన మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రాన్ని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ మహాజనసభ జిల్లా అధ్యక్షుడు మెతుకు శివకుమార్ మాట్లాడుతూ.. 2016 నుంచి నేటి వరకు నూతన మత్స్య పారిశ్రామిక సంఘం ఏర్పాటు చేయలేదని తెలిపారు. ముదిరాజ్‌లు 8 సంవత్సరాల పాటు ఇబ్బందులకు గురయ్యారని అన్నారు. గ్రామ ముదిరాజ్‌లు వృత్తి నైపుణ్య పరీక్షను త్రిసభ్య కమిటీ సమక్షంలో పూర్తి చేసుకొని తొమ్మిది నెలలు గడుస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో భూమయ్య, కృష్ణ, సాయిలు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఖలీల్‌వాడి, మే 22 : జిల్లాకేంద్రంలోని గంగస్థాన్ ఫేస్–2 పరిధిలో గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ తోట రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రైనేజీ నిర్మాణంలో భాగంగా అడ్డువస్తున్న 11 కేవీ, ఎల్‌టీ లైన్లను మారుస్తున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## విద్యుద్దీపాలకు మరమ్మతులు

ధర్పల్లి (సిరికొండ), మే 22: ధర్పల్లి మండలకేంద్రంలో విద్యుద్దీపాలకు బుధవారం మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి సైపుద్దీన్ మాట్లాడుతూ.. గ్రామంలో విద్యుద్దీపాలు వెలగడం లేదని, హైమాస్ట్ లైట్‌కు క్రేన్ సాయంతో మరమ్మతు చేశామని తెలిపారు.

## కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

ఇందల్వాయి, మే 22 : మండలంలోని నల్లవెల్లి తిరుమల వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. ఉదయం స్వామివారికి ప్రత్యేకంగా అభిషేకం, హోమం, పుష్పార్చన తదితర కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

## భాగ్యరెడ్డి వర్మకు నివాళి

ఆర్మూర్‌టౌన్, మే22: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బుధవారం తెలంగాణ వైతాళికుడు, సంఘ సంస్కర్త భాగ్యరెడ్డి వర్మ 136వ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కార్మిక సంఘం నాయకుడు పింజా అశోక్, మాల సంఘ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అర్పించారు. కార్యక్రమంలో మాల సంఘం నాయకులు ప్రదీప్, మూగ ప్రభాకర్, శెట్పల్లి నారాయణ పింజా సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య నిర్మూలనపై దృష్టిసారించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో మధురిమ

సారంగాపూర్, మే 22 : మండలంలోని 19 గ్రామాల్లో మురికి కాలువల్లో పేరుకుపోయిన పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో మధురిమ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. తన చాంబర్‌లో పంచాయతీ కార్యదర్శులతో బుధవారం సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై సమీక్షించారు. త్వరలో వానకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించారు.

## లిఫ్ట్ పనులు వేగవంతం చేయాలి


లిఫ్ట్ పనులను పరిశీలిస్తున్న జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు

మాక్లూర్, మే 22: లిఫ్ట్ పనులు వేగవంతం చేయాలని జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అధికారులకు సూచించారు. మండలంలోని ధర్మోరా గ్రామపంచాయతీ పరిధిలోని లక్మాపూర్ గ్రామంలో నిర్మిస్తున్న బొంకన్‌పల్లి, ముల్లంగి ఎత్తిపోతల పథకం పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడారు. లిఫ్ట్ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వానకాలం పంటలకు లిఫ్ట్ నీరందేలా పనులు వేగవంతం చేయాలని సూచించారు. ముల్లంగి(బి), బొంకన్‌పల్లి గ్రామాల పరిధిలోని 1100 ఎకరాలకు ఈ లిఫ్ట్ ద్వారా సాగునీరందేందుకు పైపులైన్ పనులు పూర్తి చేయాలని అన్నారు. ఆయన వెంట బొంకన్‌పల్లి గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నీళ్లున్నా.. నిరుపయోగంగా ట్యాంకులు

రెంజల్,మే 22: మండలంలోని కందకుర్తి గోదావరి పుష్కర క్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం నిర్మించిన తాగునీటి ట్యాంకులు అధికారుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. గోదావరినదిలో పుణ్య స్నానాలు ఆచరించి మొక్కులు చెల్లించుకున్న భక్తులు వంట చేసుకునేందుకు 2500 లీటర్ల సామర్థ్యంగల నాలుగు మినీ ట్యాంకులను 14వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా నిర్మించారు. పైపులైన్ పనులు పూర్తయి ఏడాది గడుస్తోంది. సంబంధిత అధికారులు ట్యాంకులకు కనెక్షన్ ఇవ్వకుండా వదిలేశారు. సింగిల్ ఫేజ్ మోటర్ అందుబాటులో ఉన్నప్పటికీ వేసవి కాలంలో భక్తులకు నీటి సౌకర్యం కల్పించేందుకు గ్రామీణ నీటి సరఫరా విభాగం, దేవాదాయశాఖ, పంచాయత్‌రాజ్ శాఖలు పట్టించుకున్న పాపాన పోలేదని భక్తులు మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


కందకుర్తి పుష్కర క్షేత్రంలో నిరుపయోగంగా ఉన్న ట్యాంకు

# పచ్చిరొట్ట ఎరువుతో భూమి సారవంతం

- జీలుగ విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలి
- ఏడీఏ మల్లయ్య

మోర్తాడ్, మే22: నేల భౌతికస్థితిని మెరుగుపర్చుకునేందుకు, భూమిని తిరిగి సారవంతం చేసుకునేందుకు జీలుగ ఉపయోగపడుతుందని ఏడీఏ మల్లయ్య, ఏవో లావణ్య అన్నారు. మోర్తాడ్ సొసైటీలో, కమ్మర్‌పల్లి, ఉప్లూర్ గ్రామాల్లో సబ్సిడీపై జీలుగ విత్తనాలను పంపిణీ చేసిన సందర్భంగా రైతులకు అవగాహన కల్పించారు. జీలుగ విత్తనాలను తొలకరి జల్లులకు పొలంలో విత్తుకుని 50 శాతం పూతదశలో ఉన్నప్పుడు భూమిలో కలియదున్నాలని సూచించారు. ఈసమయంలో ఎకరానికి 50 కిలోల సూపర్ ఫాస్ఫేట్ చల్లితే జీలుగ త్వరగా కుళ్లిపోయి ఎరువుగా మారుతుందని తెలిపారు. జీలుగ పంట చౌడు భూములు, వరిపంట పండించే భూములకు చాలా అనుకూలమని చెప్పారు. ఎకరానికి 12 నుంచి 15 కిలోల జీలుగ విత్తడంతో 10 టన్నుల వరకు పచ్చిరొట్ట లభిస్తుందని అన్నారు. టన్ను పచ్చిరొట్ట ఎరువులో ఆరు కిలోల నత్రజని, 1–1.5 కిలోల సల్ఫర్, పొటాషియం భూమిలో స్థిరీకరించబడుతాయని చెప్పారు. భూమి సారవంతం కోసం జీలుగ సాగు చేయాలని సూచించారు. 60 శాతం రాయితీపై జీలుగ విత్తనాలను అందిస్తున్నామని, అవసరమనుకునే రైతులు పట్టాపాస్‌బుక్, ఆధార్‌కార్డులు తీసుకువచ్చి తీసుకోవాలని సూచించారు. సొసైటీ చైర్మన్లు కల్లెం అశోక్, రేగుంట దేవేందర్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.


మోర్తాడ్‌లో విత్తనాలను పంపిణీ చేస్తున్న అధికారులు

**విత్తనాల పంపిణీ ప్రారంభం**

వేల్పూర్, మే 22: సబ్సిడీపై అందిస్తున్న జీలుగ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి నర్సయ్య తెలిపారు. మండలంలోని రామన్నపేట్, పచ్చలనడ్కుడ గ్రామాల్లో జీలుగ విత్తనాల పంపిణీ కార్యక్రమం ప్రారంభించి మాట్లాడారు. జీలుగ విత్తనాలను మండలంలోని ఆయా సొసైటీల పరిధిలో అందజేస్తున్నట్లు తెలిపారు. సొసైటీ కార్యదర్శి రణవీర్, సిబ్బంది పాల్గొన్నారు.

**అందుబాటులో జీలుగ విత్తనాలు**

మాక్లూర్, మే 22: మండలంలోని అమ్రాద్, మాక్లూర్ సహకార సంఘాల పరిధిలో గ్రామాలకు జీలుగ విత్తనాలు పంపిణీ చేసినట్లు వ్యవసాయాధికారిణి పద్మ తెలిపారు. 30 కేజీల జీలుగ బస్తాకు సబ్సిడీ పోను రూ.1,116 చెల్లించాలన్నారు. మాక్లూర్‌లో 500 బస్తాలు, అమ్రాద్‌లో 300 బస్తాలు పంపిణీ చేశామన్నారు. ఒక్కో రైతు రెండు పాసు పుస్తకాలు మాత్రమే తీసుకురావాలని, ఒక బస్తా రెండెకరాలకు సరిపోతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు రంజిత్, రాజునాయక్, రైతులు పాల్గొన్నారు.

**జీలుగ విత్తనాల పంపిణీ**

సిరికొండ, మే 22 : మండలంలోని రామడుగు వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సబ్సిడీపై జీలుగ విత్తనాలను ఏఈవో లక్ష్మీప్రసన్న బుధవారం పంపిణీ చేశారు. రామడుగు సొసైటీలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సొసైటీ చైర్మన్ చిన్నారెడ్డి, కార్యదర్శి సంతోష్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా లక్ష్మీనర్సింహస్వామి జయంతి


బోధన్‌లో మాట్లాడుతున్న పిట్ల కృష్ణ మహరాజ్

బోధన్, మే 22: బోధన్ పట్టణం బీటీనగర్‌లోని కోట మైసమ్మ సహిత లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలతో కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా మల్లారం లింగేశ్వర ఆలయ వ్యవస్థాపకుడు పిట్ల కృష్ణ మహరాజ్ హాజరై భక్తులనుద్దేశించి మాట్లాడారు. కష్ట సమయాల్లోనే కాకుండా సుఖంగా ఉన్నప్పుడు సైతం దైవనామస్మరణ చేయాలని ఆయన సూచించారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్న ఆలయ వ్యవస్థాపకుడు పసుపులేటి గోపీకిషన్‌కు దాతలు సహకరించాలని సూచించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు పసుపులేటి గోపీకిషన్, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

**భీమ్‌గల్ పట్టణంలో..**

భీమ్‌గల్, మే 22 : నర్సింహ జయంతి వేడుకలు పట్టణంలోని లక్ష్మీనర్సింహ గ్రామాలయంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నదానం చేశారు. ప్రముఖ పుణ్యక్షేత్రం లింబాద్రిగుట్టపై స్వామివారి విగ్రహాలకు స్వర్ణ అలంకరణ చేశారు. సాయంత్రం గ్రామాలయంలో ఉత్సవ మూర్తులను పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. గరుడ సేవ నిర్వహించారు.

## పల్లె ప్రగతి పనుల పరిశీలన

బోధన్ రూరల్, మే22: బోధన్ మండలంలోని పలు గ్రామాల్లో పల్లె ప్రగతి పనులను బోధన్ ఎంపీవో మధుకర్ పరిశీలించారు. పల్లె ప్రగతి పనులతోపాటు జీపీ రికార్డులు, డంపింగ్‌యార్డు, నర్సరీ, క్రీడా ప్రాంగణం, వైకుంఠధామాన్ని పరిశీలించారు. నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని కార్యదర్శులను ఆదేశించారు. ఆయన వెంట ఆయా గ్రామాల కార్యదర్శులు ఉన్నారు.

## హరితహారం చెట్లు నరికివేయకుండా చూడాలి

నవీపేట, మే 22: మండలంలోని పలు గ్రామాల్లో హరితహారం చెట్లు నరికి వేయకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో నాగనాథ్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రామ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని రోజుల నుంచి ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ వైర్లకు చెట్ల కొమ్మలు తగులుతున్నాయనే ఉద్దేశంతో ఏపుగా పెరిగిన చెట్లను మొదటికే నరికి వేస్తున్నారని చెప్పారు. ఇక నుంచి ఆయా గ్రామాల్లో సమాచారం లేకుండా హరితహారం చెట్లు నరకకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సూచించారు. గ్రామాల్లో ఇంటి పన్ను, తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం పనులు చేయించాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపీవో రామకృష్ణ, మండల పర్యవేక్షకుడు శ్రీనివాస్‌రావు, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
★I, BONAGIRI BHAJANNA, H.NO: 5-74 ,UPLOOR,KAMMARPALLY (M) NIZAMABAD(D). CHANGED MY NAME AS BONAGIRI BAJANNA.
NTZ-324687

WANTED
★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K.
Ph: 8977639662 / 8977639663.
NT-327722-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## పాఠశాలకు ఇంటర్నేషనల్ బ్రిలియన్స్ అవార్డు


ప్రశంసాపత్రంతో కరస్పాండెంట్ జావీద్ అలీ

శక్కర్‌నగర్, మే 22: బోధన్ పట్టణం రాకాసీపేట్ క్రిసెంట్ పాఠశాలకు ఇంటర్నేషనల్ బ్రిలియన్స్ అవార్డు లభించింది. ఢిల్లీలోని హైపెడ్జ్ మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో తెలంగాణ స్టేట్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్‌లో భాగంగా పాఠశాలలో నిర్వహించిన వివిధ కార్యక్రమాలు, విద్యాబోధనలో మెలుకువలు, అర్హులైన ఉపాధ్యాయులతో ఉత్తమ బోధనతో పాటు పలు అంశాలను పరిగణనలోకి తీసుకుని ఏప్రిల్‌లో ఎంపిక చేశారు. ఇందులో భాగంగా సర్టిఫికెట్, జ్ఞాపికను పోస్ట్‌ద్వారా పంపారు. ఈ విషయాన్ని పాఠశాల కరస్పాండెంట్ మీర్ జావీద్ అలీ బుధవారం వెల్లడించారు. తమ పాఠశాలకు అవార్డు రావడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఇందుకు కృషి చేసిన తోటి ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ముగిసిన శిక్షణ శిబిరం

భీమ్‌గల్, మే 22: శ్రీ సరస్వతి విద్యామందిర్ ఉన్నత పాఠశాల భీమ్‌గల్‌లో ఈనెల 1న ప్రారంభమైన సంస్కార సాధన వర్గ తరగతులు బుధవారం ముగిశాయి. విద్యార్థులకు సూర్య నమస్కారాలు, యోగా, భగవద్గీత శ్లోకాలు, హనుమాన్ చాలీసా, దేశభక్తి గేయాలు, హార్మోనియంలో శిక్షణ, క్లాసికల్ డ్యాన్స్‌లో శిక్షణ ఇచ్చారు. ముగింపు కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు డాక్టర్ జి.బసంత్‌రెడ్డి పాల్గొన్నారు. వివిధ అంశాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు, శిక్షణ ఇచ్చిన ఆచార్య బృందానికి జ్ఞాపికలు బహూకరించారు.


డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మోర్తాడ్, మే22: మోర్తాడ్ గ్రామ శివారులోని వరద కాలువలో గుర్తు తెలియని మృతదేహం కనిపించడంతో బుధవారం సాయంత్రం స్థానికులు పోలీసులకు సమాచారాన్ని అందించారు. పోలీసులు మృతదేహాన్ని బయటికి తీయించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహంపై ఎరుపు రంగు చొక్కా, యాస్ కలర్ ప్యాంట్ ఉందని, వ్యక్తి వయసు సుమారు 35 ఏండ్ల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు.

**చెరువులో పడి ఒకరి మృతి**

ఆర్మూర్‌టౌన్, మే22: మండలంలోని పిప్రి చెరువులో పడి మంగళవారం సాయంత్రం ఒకరు మృతి చెందారు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం వడ్డెపల్లికి చెందిన ఎర్రన్న కుటుంబ సభ్యులతో వలస వచ్చి పిప్రిలో ఉంటున్నాడు. మద్యం మత్తులో వెళ్లి చెరువులో పడ్డాడు. పోలీసులు గజఈతగాళ్లతోపాటు ఫైర్ సిబ్బందిని పిలిపించి మృతదేహాన్ని బయటికి తీయించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు.

## టీకాలు తప్పకుండా వేయించాలి


రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి అశోక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్

ఆర్మూర్‌టౌన్, మే22: వ్యాధి నిరోధక టీకాలు ప్రతి ఒక్క చిన్నారికీ తప్పకుండా వేయించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి అశోక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని ఫత్తేపూర్ గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్రాన్ని బుధవారం వారు తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. డాక్టర్ అశోక్ మాట్లాడుతూ వ్యాధి నిరోధక టీకాల లబ్ధిదారుల జాబితాను ముందస్తుగా తయారు చేసుకొని ప్రతి చిన్నారికి టీకాలు అందే విధంగా ఆశ వర్కర్లు చూడాలని తెలిపారు. ఎండలు అధికంగా వున్నందున వ్యాక్సిన్ కోల్డ్‌చైన్ పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు పాల్గొన్నారు.